"తెలుగులో స్మృతి కావ్యాలు "

"ఆకాశభారతి"

ఆచార్య తూమాటి దోణప్ప

ద్వానా శాస్త్రిగారు ఆచార్య తూమాటి దోణప్ప గారి ప్రియ శిష్యుడు. దోణప్పగారి వంటి విజ్ఞాన ఖని వద్ద శిష్యరికం చేసే అవకాశం దొరికినందుకు తన అదృష్టాన్ని ఎల్లప్పుడూ తలుచుకుంటూ ఉంటారు. దోణప్ప గారి వద్ద తన విద్య ఆర్తిని తీర్చుకున్నాను అని, విద్యార్థి జీవితాన్ని సఫలం చేసుకున్నాను అని మనఃపూర్వకంగా చెపుతారు. తన గురువుగారు వ్రాసిన "ఆకాశభారతి" అనే రచనలోనుంచి "తెలుగులో స్మృతి కావ్యాలు " అనే వ్యాసాన్ని మీతో పంచుకోమని నాకు అందించిన వారికి ధన్యవాదాలతో

తెలుగులో స్మృతికావ్యాలు

"బంగారపుబొమ్మ నాదు
మంగళప్రదమ్మ యొంటి
రుద్రభూమి గటికనేల
నిద్రించెడు నొడలుమరచి
చూపబోకు మచట నీ ప్ర
తాపమెల్ల పిడుగా! నా
కన్నతల్లి యెద్వగలదు
క్రూరపు నీ కాళరాత్రి
ఘోరమైన రుద్రభూమి
తల్లీ! నా మంగళప్రదా !
తడియుచు వడకుచునుంటె !
మినుకు మినుకు మినుకుమనుచు
మింటమెరయు చుక్కలార !
చెప్పరేల మీలో నా
చిన్నతల్లి యెవ్వరొక్కొ ?"— ముక్కుపచ్చలారక

మునుపే మృత్యువుపాలైన తన మురిపాల ముద్దుబిడ్డ మంగళప్రద అకాల మరణాన్ని గూర్చి శోకవిహ్వలులైన బసవరాజు అప్పారావు గొంతులో గూడుకట్టిన ఈ తీవ్ర పరిదేవనం సహృదయుల హృదయాల్ని కళుక్కు మనిపించే మరణ గీతికాభాగం ఇలాగా అకాలమరణమో, హఠాన్మరణమో పొందిన ప్రియజనుల వియోగంతో ఆవేదనా, ఆవేశమూ, ఆక్రోశమూ

ముప్పిరిగొనే విధంగా రచించబడ్డ కావ్యభేదం స్మృతి కావ్యమని ప్రకృత ప్రసంగంలో పరిభాషించబడింది.

మృతులమీది అనురాగాన్నీ, ఆత్మీయతనూ, ఆదరాభిమానాలనూ, గౌరవప్రపత్తులనూ, భక్తివిశ్వాసాలనూ పురస్కరించుకుని వారిని స్మరించు కోవడం లోకంలో రకరకాలుగా కనిపిస్తున్నది మృతుల స్మృతిచిహ్నాలుగా గుళ్ళూ గోపురాలూ కట్టి కొలువులు సాగిస్తారు; చావళ్ళూ సమాధులూ కట్టిస్తారు; సత్రాలో, చలివేంద్రలో నిర్మిస్తారు. చెరువులో, దొరువులో తవ్విస్తారు వారిజ్ఞాపకకు గుర్తులుగా నిధులూ, బహుమతులూ, ప్రత్యేక సంచికలూ, కవిపండిత సత్కారాలూ, ధర్మనిధి ఉపన్యాసాలూ, మృతులకు ప్రియమైన ఆటపాటలలో పోటీలూ నిర్వహిస్తారు. సంస్మరణ సూచక పతకాలు ఏర్పరుస్తారు ఏటేటా మృతుల మరణ దినాలలో వార్తాపత్రికల్లో వారి గుణగణాలను ఉపశ్లోకిస్తూ ఫోటోలతో, వారి గుణశీలాల కనుగుణమైన సూక్తుల ఉట్టంకింపులతో ప్రకటనలు చేయిస్తారు. ఆరాధనలూ, అన్న దానాలూ జరిపిస్తారు. భజనలూ, హరికథాగానాలూ, పురాణకాలక్షేపాలూ ఏర్పాటు చేస్తారు. స్వాతంత్ర్య సంపాదనకో, సమితాధర్మ సంస్థాపనకో వీరమరణం పొందిన త్యాగధనుల స్మృత్యర్థం ప్రాచీన యుగాలలో పశ్చిమాంధ్రంలో ఊరూర ప్రవర్తిల్లిన 'వీరగల్లు' ప్రతిష్ఠలూ, ఊరుమ్మడి మేలుకోరి ఆత్మాహుతిచేసుకునిగాని, నాడు నారీధర్మంగా ఎంచబడి సహ గమనం చేసిగాని, 'మహాసతులు' గా కీర్తించబడ్డ సతీమతల్లుల స్మృత్యర్థం నిలిపిన 'మాస్తిగల్లు' (మహాసతికల్లు)లూ ఈ వరుసలోనివే. సుచరిత్రవతు లైన మృతులపేర స్మృత్యంకాలుగా కావ్యాదికాలను అంకితం చేయడం, చేయించడం కూడా కొత్తకాదు. మన సంప్రదాయంలో అనూచానంగా వస్తున్న దినవారాలూ, మాసికాలూ, ఆబ్దికాలూ, పితృపక్షాలూ, పెద్దల పండుగలూ, గయాపిండప్రదానాలు, వైతరణీగోదానాలూ, గరుడ పురాణ - గీతాపారాయణాలూ - మొదలైనవన్నీ కథావశేషులైన బంధుజనుల

సంస్మరణకోసం ఆ యా తెగలలో, కులాలలో, ప్రాంతాలలో వాడుకపడ్డ ఆచార విశేషాలు.

కవితారూపంగా మృతులను సంస్మరించుకోవడం మనకు పొత్తిగా కొత్తదని చెప్పలేము. పురాభారత పురాణ కావ్యేతిహాసాదులలోనూ, దేశ భాషా వాఙ్మయవిధులలోనూ మరణాలూ, తత్ స్మరణాలూ తరచుగా తటస్థపడుతూనే ఉన్నాయి రామాయణ రచనకు మూలబీజంగా సంభావిత మవుతున్న క్రౌంచ ద్వంద్వ వియోగ శోక కథనరూపమైన 'మా నిషాద .' శ్లోకాన్ని భారతీయ లౌకిక సాహిత్యంలో తొలిస్మృతిగీతికగా పరిగణించవచ్చు. అందువల్లనే శాపవాక్కు గీర్వాణ వాణికి పెద్దదిక్కు అని సాహిత్య సత్యవ్రత సంపన్నులు చమత్కరిస్తూ ఉంటారు. రామాయణంలోని దశరథుని మరణం, జటాయు హననం, వాలివధ, రావణుని చావుపై మండోదరి విలాపం, భారతంలోని అభిమన్యువధ, ఊరుభంగం, స్త్రీపర్వాంతర్గత శోకఘట్టాలు, భాగవతంలోని శ్రీకృష్ణ నిర్యాణం, హరిశ్చంద్రోపాఖ్యానంలో సర్పదష్టుడైన లోహితాస్యుని మరణం - మొదలైన ప్రాసంగిక ఘట్టాలను కొన్ని ఉదాహరణలుగా ఉట్టంకించవచ్చు. అయితే, ఇవన్నీ ఒకానొక ధారావాహికా కథనంలోని అనుషంగికాలైన సాధారణ సన్నివేశాలు.

శ్రీనాథకృతంగా ఉదాహరించబడుతున్న 'కాశికా విశ్వేశు గలిసె వీరారెడ్డి ...' అన్న చాటువునీ, అల్లసాని పెద్దన్న రచనగా ఉద్ధరించబడుతున్న 'ఎదురైనచో దన మదకరీంద్రము డిగ్గి .' అన్న చాటువునీ తెలుగులో స్మృతి కవితోదయానికి తొలివెలుగురేకలుగా కొందరు పేర్కొంటున్నారు. తాళ్ళపాక అన్నమాచార్యులపై తద్వంశీయులు కూర్చిన సంకీర్తన వాఙ్మయం సైతం ఈ రాశికే చేరుతుంది.

బొబ్బిలి వీరులమీదా, సాహసకృత్యాలుచేసి హతులైన సర్వాయి పాపడు, దాచేపల్లి గుర్రాల గోపిరెడ్డి, గిడేకల్లు బొబ్బిళ్ళ నాగిరెడ్డి, ఆదోని రాచోటి రామయసెట్టి, ఈడిగ రామన్న, గాండ్లవాని కురుమలన్న, రేనాటి సీమ మానంచిరెడ్డి, ఉయ్యాలవాడ దొరవారి నరసింహారెడ్డి, కోటప్పకొండ చిన్నపరెడ్డి - మున్నగు వ్యక్తులపైనా అల్లిన కరుణరస నిష్యంది మరణ గీతాలు జానపద సాహితీ మణిహారంలో పోహళించబడ్డ జాతి రత్నాలు. మొహరం పండగ పదోరోజు సాయంకాలం పీర్లు గుండానబడ్డాక జలాలీలు భక్తకోటి ఆలాపించే 'అల్విదా' వీడ్కోలు శోక గీతాలు కర్బలా రణరంగాన దుర్మరణం పాలైన అమరవీరుల జ్ఞాపక సంకేతాలుగా ఉప్పెత్తిన స్మృతి తరంగాలు.

అయితే, మొన్న మొన్నటిదాకా ఈ శాఖ తెలుగులో పరిగణించదగ్గ కళారూపంగా సాహిత్యస్రష్టల మనసును ఆకట్టుకోలేకపోయింది. ప్రత్యేక వాఙ్మయశాఖగా సాహిత్య విమర్శకుల దృష్టిని ఆకర్షించలేకపోయింది. దీనికి హేతువులు సుస్పష్టం. శుభకామనలు పెచ్చుపెరగాలనీ, సురుచిర వాక్కులు ఉచ్చరించాలనీ మన పెద్దల ఆశ. మంగళ గాథికలు ఆలకించాలనీ, మంగళదృశ్యాలు పరికించాలనీ మనపూర్వుల ఆశయం. 'భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రంపశ్యే మాక్షభిర్యజత్రా ..' ఇత్యాది ఋఙ్మంత్ర సంతతి ఈ ఆశలకూ, ఆశయాలకూ ఆధారభూమి అందుకనే మన కావ్యాలన్నీ ఆదిమధ్యాంతాలలో మంగళమయాలుగా, కల్యాణకారకాలుగా నిర్వహించబడాలని లాక్షణికులు శాసించడం జరిగింది. అంతేగాక, 'రస విచ్ఛేద హేతుత్వాత్ మరణం నైవవర్ణ్యతే'-రసవిచ్ఛేద హేతువవుతుంది కాబట్టి మరణం అనువర్ణనం కూడదని శాస్త్రకారుల అనుశాసనం. అయితే, తప్పని సరియైన సన్నివేశాలలో పరిపోషకంగా తప్ప ప్రధానాంశంగా మరణకథనానికి ప్రవృత్తి కూడదని లాక్షణిక హృదయం. అంచేత

ప్రమోదప్రధానాలైన కావ్యాలకు తక్క విషాదప్రచురాలైన కావ్యాలకు మనసాహిత్యంలో ప్రాయికంగా తగిన తావులేకపోయింది.

ఆధునికాంధ్ర సాహిత్యంలోని గురజాడవారి 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ', 'కన్యక'; కట్టమంచివారి 'ముసలమ్మ మరణము', కోలాచలం వారి 'అళియరామరాయలు', దువ్వూరి రామిరెడ్డి 'నలజారమ్మ', ముదివర్తి కొండమాచార్యుల 'నారాయణమ్మ' వంటి విషాదాంత కావ్యాలు పై వాదానికి అపవాదంగా నిలిచిన ఉత్తమరచనలు.

గ్రీక్ భాషలో 'ఎలగోస్' అంటే విలాపమనీ, శోక గీతమనీ అర్థం. ఆ భాషలో 'ఎలజీ' అన్నది సంస్మరణార్థం రచించబడిన శోకపూరితమైన కావ్యం. అయితే, 'ఎలజీ' అన్న కావ్యశాఖకు గ్రీక్ - రోమన్ సాహిత్యాలలోనూ, వాటి నీడలో పెరిగి పెద్దదైన ప్రాచీనాంగ్ల సాహిత్యంలోనూ కొంత విస్తృతార్థం ఉంది. ఇతివృత్త స్వభావం ఎలాటిదైనా విషాదచ్ఛాయ కలిగిన 'ఎలిజియాక్' అనే విశిష్టచ్ఛందంలో రచితమైన కావ్యభేదాన్ని వారు 'ఎలజీ' అని విపులార్థంలో వాడుక చేశారు ఇంగ్లీషు సాహిత్యంలో పూర్వ పూర్వ యుగాలలో ఇలాటి విస్తృత పరిధిలోనే ఈ కావ్యాలు రచించబడి నప్పటికీ పదారో శతాబ్ది నుంచీ మరణ స్మరణ వైపే మొగ్గు చూపడం జరిగింది తెలుగుసీమలో కాల్పనికోద్యమాన్నీ, ఆత్మాశ్రయ కవితా రీతినీ బహుధా ప్రభావితం చేసిన ఆంగ్ల కవులు షెల్లీ, మాథ్యూ ఆర్నాల్డ్, అలెగ్జాండర్ పోప్ వంటివారు ఎలజీని మరణ స్మరణకే పరిమితం చేసిన కారణంగా తెలుగులో ఈ గెర గీతలలోనే స్మృతి కావ్యాలు మూసపోతగా రూపెత్తాయి.

స్మృతికావ్యాలకు ఆలంబనాలుగా స్వీకరించబడ్డ మృతులు ఏ తత్కావ్యకర్తలకు సుపరిచితులైనా కావచ్చు; అపరిచితులైనా కావచ్చు. ఆత్మబంధువులూ, ఆప్తమిత్రులూ సుపరిచితులని చెప్పవచ్చు. లోకం బాధ

తమబాధగా భావించిన సంఘసేవకులూ, దేశంకోసం నిండుప్రాణాలను బలి ఇచ్చిన అజ్ఞాత అమరవీరులూ అపరిచితులని అనవచ్చు ఆత్మబంధువులలో తల్లిదండ్రులు, భార్యాభర్తలు, కన్నబిడ్డలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు, మామా అల్లుళ్ళు, ఇతర సమీప బంధువులూ వస్తారు. కొన్ని సందర్భాలలో కలం, పుస్తకం వంటి అచేతన వస్తువులపైనా. కుక్క, పిల్లి, గుర్రం వంటి పెంపుడు జంతువులపైనా స్మృతి కవిత చెప్పిన వారూ ఉన్నారు.

తమ మొదటి భార్య మరణించిన సందర్భంలో వడ్డాది సుబ్బారాయ కవి 1891 లో 'ఆంధ్ర భాషా సంజీవని' పత్రికలో ప్రకటించిన 'సతీ స్మృతి' అన్న ఖండికయే ఆధునికాంధ్ర సాహిత్యంలో మొట్టమొదటి స్మృతి కవిత అని చెప్పవచ్చు. గృహిణీధర్మమే స్త్రీ రూపంగా అవతరించిన ధర్మపత్ని చితాగ్నిలో భస్మమైపోగా బాధాపరిఖిన్నుడైన విశ్వనాథ సత్యనారాయణ విరచించిన వరలక్ష్మి త్రిశతి, గృహిణీ జనతా శిరోమణి యైన తన సతి లక్ష్మీనరసమ్మ మరణంపై పింగళి లక్ష్మీకాంతం రచించిన లక్ష్మీనిర్గమనం, 'మెడపైకెత్తి యొకానొకప్పుడు శరన్మేఘంబులంగాంచి నీ పౌడ నేమే నెఱిగించు నేమొ యని నే బుద్ధీంద్రియక్షోభతో .. ' అని అడుగుతూ పసిబిడ్డడిలాగా రోదించిన మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రి తీర్చిన 'సతీస్మృతి', ఇల్లాలి మరణంతో కుమిలిపోయిన బాలాంత్రపు వేంకటరావు కూర్చిన 'విరహ సంగీత' కావ్యం, పట్టుమని పాతికేళ్ళు నిండకుండానే పరమపదించిన గృహలక్ష్మిపై కవికోకిల దువ్వూరి రామిరెడ్డి సంతరించిన 'భగ్నహృదయము', 'ముప్పది యెన్మిదేండ్లు వలపుల్ మమతల్....' పచరించిన అర్ధాంగి లీలాకుమారి మరణంతో కుమారిల్లిన కొప్పరాపూరి సత్యనారాయణ కూర్చిన 'స్మృత్యంజలి' విద్యావినయ సంపన్నయైన సుశీలమ్మ అకాలమృతి ఆలంబనంగా ఆమె భర్త పిల్లలమర్రి వెంకటహనుమంతరావు రచించిన సుశీలా స్మృతికావ్యం, కథాకాలక్షేప

ప్రవీణులు గుంటి యోహాన్ భాగవతార్ కూర్చిన 'సతీస్మృతి' ఈ కోవలో చెప్పుకోదగ్గ రచనలు.

భర్తృమరణం కారణంగా రచించబడ్డ స్మృతికావ్యఖండికలు తెలుగున మా లెక్కకు రెండంటే రెండు లభ్యమయ్యాయి తన భర్త విమాన యానంలో దుర్మరణం చెందగా తిరుపాప్పూరు జమీందారిణి ఇనుగంటి సరస్వతీదేవి కావించిన సతీవిలాపమున్నూ బసవరాజు అప్పారావు భార్య రాజ్యలక్ష్మమ్మ భర్తృవియోగ దుఃఖావంతో రచించిన స్మృతిగేయమున్నూ పునస్సమాగమాభిలాషకు వీలులేని వియోగం కారణంగా రతి విలాపాన్ని మించిన రచనలు.

మాతృమరణాన్ని పురస్కరించుకుని జాషువా, నాయని, శ్రీ శ్రీలు నిర్మించిన స్మృతికావ్యాలు చిరస్మరణీయాలు.

"ఇల్లున్ వాకిలి లేని దానివలె నే డీ శాకినీ ఢాకినుల్
పిల్లల్ సేయు శ్మశాన భూములను బ్రాపింపంగనేలా? జగం
బెల్లం జీకటి ముద్దయై పొడమె తల్లీ! నీ వియోగంబునం
జిల్లుల్ వడ్డది మానసంబు...."

'ఒంటిగనుందు వా యిచట?........నీ వింటను లేక'

'పుణ్యముం తల్లి! నీ పాలపుష్టి కతన

కవనబాలిక నా జిహ్వ నవతరించె....'నని పలవించిన జాషువా శోకవాక్కు, రసజ్ఞుల గుండెలో బాకు. తన పూజాసామగ్రిని సేకరించుకోక ముందే కన్నతల్లి కాలధర్మం చెందిందని తల్లిలేని బిడ్డడుగా విలపించిన నాయని సుబ్బారావు మాతృగీతాలతో మాతృమూర్తిపరమైన ఆవేదనా, మృత్యుదేవిపరమైన ఆక్రోశమూ పడుగుపేకల్లా కన్పిస్తాయి నష్టమాతృ చరిత్రనెరుగని తన్నులాలించి పెంచి పెద్దజేసిన సవతితల్లి సుభద్రమ్మ

గతించినపుడు తన ప్రథమ కావ్యసంతానం 'ప్రభవ'ని ఆమె కంకితం ఇస్తూ శ్రీశ్రీ రాసిన అంకితగీతికలు కేవలం శోకం ముద్దగట్టిన మూర్తులు.

'కోపగించుకొన్నా కొట్టినా తిట్టినా
కొసరుకొన్నా మిక్కిలికేకలు వేసినా
బిడ్డల భవిష్యత్తుకు
పూలబాట వేయాలన్నదే ......అమ్మలక్ష్యం' అని వాళ్ళ అమ్మ కృష్ణమ్మ మరణంపై శ్రీరామప్పగారి గంగప్ప రచించిన 'అమ్మ' అన్న గేయం ఈ కుదురునకు చెందిందే.

కానక కన్నబిడ్డల అకాలమరణంపై రాయప్రోలు సుబ్బారావు, బసవరాజు అప్పారావు దంపతులు, నాయని సుబ్బారావు రచించిన స్మృతి గీతాలు కరుణ రసస్రావి సన్నివేశాలకు ఉత్తమోదాహరణాలు ముద్దు ముచ్చటలు తీరకుండానే పిన్నవయస్సుననే కొడుకు మరణించాడన్న సంతాపమా, తపోధనుడొకడు యోగభ్రష్టుడై కారణజన్ముడుగా తమ కడుపున పుట్టి తమ వంశాన్ని తరింపజేశాడన్న సంతృప్తియా? ఏది పితరులకు మిగిలేది? అన్న విచికిత్స రాయప్రోలు చింతనలో కన్పిస్తుంది 'కడకు దేవి దయచేతను కంటిమి రత్నములు రెండు బతుకు కలంకారములే, వాని దాచ చేతగాక ఎచటనో పోగొట్టుకొంటి మెంతటి దురదృష్టముననో'- నిరలంకృతమూ, నిరాడంబరమూ అయిన రాజ్యలక్ష్మమ్మగారి ఈ గేయ భాగంలో మాతృప్రేమలోని మహత్తర శక్తి, వెల్లడించడానికి మాటలుచాలని భావతీవ్రతా ఇమిడి ఉన్నాయి. ఒక్కగానొక్క వంశాంకురం - మోహన రావు - అకాలంలో అంతరించిపోగా, ఆ దుఃఖభారానికి ఆగలేక నాయని సుబ్బారావు తీర్చిన 'విషాదమోహన' మన్నకావ్యంలో మానసార్తి రోచనమూ, గాఢవిచారమూలకమైన తత్త్వార్థబోధమూ గోచరిస్తాయి.

సోదర స్మృతిపరమైన జనమంచి వెంకటరామయ్యగారి 'భువినుందు నేను దమ్ముడ దివినుందువు నీవు. భువియు దివియును నను నియ్యవి రెండు నుండు బ్రేమన గవలంబలె నొక్క తల్లి కడుపున నోహో' అన్న అద్వైతభావనలోని ఆత్మనిర్వేదం మరచిపోరానిది.

ఒక్కగానొక్క చెల్లెలి అకాలమృతికి తల్లడిల్లిన 'హిమగళ' కావ్య నిర్మాత మోటూరి వెంకటరావుగారి 'ఓ చెల్లి' అన్న కావ్యఖండం సోదరీ స్మృతికి చక్కటి నిదర్శనం ప్రసిద్ధాలంకారికులు అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి మృతిపై వారి అల్లుడూ, మేనల్లుడూఐన కొలచలమ సుబ్బావధాని రచించిన 'స్మృతిగీతము' సైతం ఈ సందర్భంలో స్మరించదగ్గది.

పెంపుడు జంతువులపై అల్లిన స్మృతికవితలలో జాషువా 'జాకీ' అన్న కళాఖండం ప్రశస్తమైనది. 'నా బంగారు జాకీ నమస్సులతో నీకు సమాధిచేసితిని అశ్రుస్నాన మాడించితిన్' అన్న మాటలలో జంతువులపై సైతం కవికిగల అమితమైన మమత పరిస్ఫుట మవుతున్నది.

చిత్తరంజన్‌దాస్, గోఖలే, గాంధీ మున్నగు జాతినాయకుల నిర్యాణం సందర్భంగా విరచితాలైన స్మృతిగీతావళిలో రాయప్రోలు, జాషువా, తుమ్మల సీతారామమూర్తి, నాయని, పుట్టపర్తి దంపతులు, కొత్త సత్యనారాయణ చౌదరి, పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు, దాశరథి, నారాయణరెడ్డి, బాలగంగాధరతిలక్, జ్ఞానానందకవి-వగైరాల రచనలను ఉత్తమ కళాఖండాలుగా ఉదాహరించవచ్చు. గాంధీజీ నిర్యాణ సంస్మరణంగా యేలూరిపాటి అనంతరామయ్య నిర్మించిన ఉదాహరణ కావ్యం విశేషించి పేర్కొనదగ్గది వెనకటి చైనా పాకిస్తాన్లతోడి సమరాలలోనూ ఇటీవలి నక్సలైట్ ఉద్యమంలోనూ అసువులు బాసి నామ్‌నిశానీకానని వారి స్మృత్యర్థం శ్రీశ్రీ ప్రభృతులు కూర్చిన అనేక స్మృతిగీతాలు తెలుగు జనతను ఊపివేసినవి.

సహవ్రతుల కోసం, సాహిత్య సత్యవ్రతులకోసం ద్రవించిన హృదయాలనుంచి స్రవించిన స్మృతికవితా ధారలు అనేకం రసహృదయాలను పరిప్లావితం చేస్తున్నాయి. అద్యతనాంధ్రకవి ప్రపంచ నిర్మాతలు తిరుపతి వేంకటకవులలో ఒకరైన తిరుపతిశాస్త్రి పరమపదించినప్పుడు 'మృతులం గూరిచి యేడ్పు పద్యముల నే నేనాడు చెప్పన్....' అనే నియమంగల చెళ్ళపిళ్ళ వేంకటకవి రచించిన 'మిత్రస్మృతి' పద్యాలూ, ప్రసిద్ధ సిద్ధ పురుషులుగా పేరుపొందిన బ్రహ్మానంద తీర్థయతీంద్రులు కాశీక్షేత్రంలో సిద్ధిని పొందినపుడు వారి అంతేవాసి అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి 'అవతారమ్ము సమాప్తి జేసితివె బ్రహ్మానంద తీర్థప్రభూ' అని విలపిస్తూ రచించిన 'గురుస్మృతి' పద్యాలూ, గుంటూరు మండలంలో ఒకనాడు మకుటంలేని మహారాజుగా మన్ననలందిన కీర్తిశేషులైన జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిని 'జనన మరణ దుష్ప్రసక్తిలేని నెలవున నిలువు' మని ఆకాంక్షిస్తూ తెలుగలెంక తుమ్మల సీతారామమూర్తి నిర్మించిన 'నెఱదాత' అన్న కావ్యఖండికా, ఆంధ్ర వాగ్దేవి గుడిగంటలు మోగించిన కాటూరి మృతిపై తుమ్మల కైసేసిన సంస్మృతి పద్యాలూ, సుప్రసిద్ధ సంస్కర్తలున్నూ, బ్రాహ్మ మతానుయాయులున్నూ ఐన దేశిరాజు బాపయ్య పరమపదించినప్పుడు వారి ఆప్తమిత్రులు చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులు 'సుహృద్రత్నమా' అనే మకుటంతో కూర్చిన తొమ్మిది పద్యాలూ, బాల్య మిత్రుడైన పేలాల సుబ్బయ్య మరణంపై సురవరం ప్రతాపరెడ్డి రచించిన పద్యాలూ - మిత్ర స్మృతికి చక్కటి తార్కాణలు. 'నడికడలి కడుపులో సుడుల అడుగున పడిన ఏ మంచి ముత్యాలు ఏరుటకు ఏగిరో - కవిగారు మరి రారు కంటి కగపడబోరు ' అని 'ఆరుద్ర' మారేపల్లి రామచంద్ర శాస్త్రిపై చెప్పిన ఈ స్మృతిగీతికా, కవిబ్రహ్మ ఏటుకూరి వెంకటనరసయ్య మరణాన్ని పురస్కరించుకుని

జాషువా, కొండేపూడి వెంకటకవి ప్రభృతులు కావించిన అశ్రుతర్పణాలు' ఆంధ్ర నాటక రంగస్థల సముద్ధరణకూ, గుడివాడ - కళాశాలా నిర్వహణకూ జీవితాన్ని మీదుకట్టిన 'కళా పోషకుడు' కాజ వెంకటరామయ్య మృతిపై కోట సీతారామశర్మ ఘటించిన 'స్మృత్యంజలి' పద్య సంపుటీ, కవికోకిల జాషువాపై శనగవరపు నరసింహశాస్త్రి ఘటించిన స్మృత్యంజలీ, షేక్ మీరాజాన్ మధురస్మృతీ - నేటికీ దివ్యస్మృతులుగా నిలిచిపోయాయి. ప్రసిద్ధ నవలా రచయిత్రి శ్రీదేవి మరణంపై నాయని కృష్ణకుమారి తీర్చిన 'ఏం చెప్పను నేస్తం' అన్న రచన గుండె లోతులను తాకే స్మృతి గేయం దొమ్మేరు జమీందారు పెండ్యాల శ్రీరామచంద్ర వేంకటకృష్ణ రంగారావు మృతిపై 'దైవ దుర్విపాక భావితమైనట్టి దుఃఖమునకు శాంతి దొరకగలదె' అంటూ వేదుల సూర్యనారాయణశర్మ రచించిన 'రంగరాయ చరిత్ర' అన్న ఖండకావ్యమూ, భాషా విజ్ఞానరంగంలో వర్ధమానుడుగా పెద్దల మనస్సునకెక్కి మానవత్వమే మూర్తికట్టిన కందప్పచెట్టి అనుకోని రీతిలో కనుమూసిన కథనం గుండెలను మండించగా ప్రాణానికి ప్రాణమైన అతని సహాధ్యాయి వి. రామచంద్ర విరచించిన 'అశ్రుతర్పణ' మన్న లఘుకృతీ ఈ రాశికి చెందిన ప్రశస్త రచనలు.

అధునికాంధ్ర కవితా రంగంపై గజ్జె కట్టీకట్టకముందే నూరేళ్ళు నిండిన కొంపెల్ల జనార్దనరావు, దేవరకొండ బాలగంగాధర తిలక్ వంటి చరితార్థుల మరణానికి పరితపిస్తూ మహా. వి శ్రీశ్రీ రచించిన స్మృతి గేయాలు ఈ కోటిలో పరాకోటి కెక్కినవి. నిండుజీవితం ప్రారంభం కాకముందే 'ఉదయిని' పత్రికానిర్వహణంలో బలైపోయిన జనార్దనరావు మరణం మూలంగా నిరాశా నిస్పృహలు అలముకున్నా, కవితా ప్రపంచంలో అసహాయ శూరుడైన శ్రీశ్రీ తన కర్తవ్యాన్ని విస్మరించలేదు. అందుకే ఆయన అన్నాడిలా ఆశావాదిగా—

'లేదు నేస్తం! లేదు
నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు
నిరుత్సాహాన్ని జయించడం
నీ వల్లనే నేర్చుకుంటున్నాం
ప్రతికూల శక్తుల బలం మాకు తెలుసు
భయంలేదులే అయినప్పటికీ
నీ సాహసం ఒక ఉదాహరణ!
నీ జీవితమే ఒరవడి!
నిన్న వదలిన పోరాటం
నేడు అందుకోనక తప్పదు
కావున ఈ నిరాశామయ లోకంలో
కదన శంఖం పూరిస్తున్నాను
ఇక్కడ నిలబడి నిన్ను
ఇవాళ ఆవాహనం చేస్తున్నాను
అందుకో ఈ చాచిన హస్తం'

Keywords: AcArya tUmATi doNappa gAri rachana, AkASa bhArati, telugu lO smruti kAvyAlu, jAnapada mudra, telugu vyAsAm, AchArya toomATi doNappa, dwA.nA.SAstry, telugu lO smRiti kAvyAlu, smRti kAvyam